సాక్షి
జనగామ
శనివారం | 27 | జనవరి | 2024



16 కిలోల గంజాయి స్వాధీనం

కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తి వద్ద 16 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తెలిపారు. - 8లో



బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి

మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో బెల్ట్‌షాపులపై దాడి చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
32^0 / 17^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ కాస్త చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

'పల్లె పల్లెకు బీజేపీ'ని విజయవంతం చేయాలి



జనగామ రూరల్: ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి చాడ శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేశ్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రామాల్లో నాయకులు నిద్రించి గ్రామంలోని సమస్యలు తెలుసుకోవాలన్నారు. యువత, మహిళలు, ప్రముఖులను కలిసి బూత్ కమిటీలు పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు లేగ రామ్‌మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ హరిశ్చంద్రగుప్త, కోంతం శ్రీనివాస్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన టీఎన్‌జీఓ నాయకులు



జనగామ: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని టీఎన్జీఓ యూనియన్ నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఆసంఘం జిల్లా అధ్యక్షుడు, జేఏసీ చైర్మన్ ఎండీ ఖాజా షరీఫ్ ఆధ్వర్యంలో కలిసి, టీఎన్జీఓ నూతన భవన నిర్మాణ పనుల భూమి పూజకు రావాలని ఆహ్వానించారు. అలాగే జిల్లాలో పని చేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించేలా కృషి చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జనగామ అభివృద్ధికి ఉద్యోగులు కృషి చేయాలని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు సంబంధించి తనవంతు కృషి ఉంటుందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో యూనియన్ నాయకులు సానము రాజనర్సయ్య, ఎండీ హఫీజ్, చింత రాంనర్సయ్య, శ్రీధర్, నాగార్జున, నరేశ్, శ్రీధర్‌బాబు, విష్ణు, స్టెల్లా, అరుణ, రాజేశ్, ఇంతియాజుద్దీన్, శైలజ, శ్రీనివాస్, అనిల్‌కుమార్, శ్రీలత, శారద, సైదా, తదితరులు పాల్గొన్నారు.

దర్యా నాయక్ పోరాటం స్ఫూర్తిదాయకం



దేవరుప్పుల : 'నిజాం సర్కార్ విముక్తి పోరులో దర్యా నాయక్ కుటుంబం ప్రదర్శించిన వీరత్వం ఈనాటి మా సామాజిక పోరాటానికి స్ఫూర్తిదాయకం' అని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మపురం పరిధి పడమటి తండాకు చెందిన దర్యానాయక్‌ను కలిసి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరి 7,8,9 తేదీల్లో పార్లమెంట్‌లో ఓబీసీ బిల్లును ప్రవేశపెట్టాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రామ్ 'ప్రోనైట్' అదుర్స్

హసన్‌పర్తి: ఎస్‌ఆర్ యూనివర్సిటీ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న స్పార్కిల్ -24 వేడుకలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు రామ్ మిర్యాల 'ప్రోనైట్' ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'చిట్టీ నీ నవ్వంటే, మనసు విరిచావే రాధికా'.. అంటూ రామ్ ఆలపించిన పాటకు విద్యార్థులు కోరస్ కలిపి సందడి చేశారు. గాయకుడు శ్రీనివాస్ పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు మహాభారతంలోని ద్రౌపది వస్త్రాపహరణ నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమాల్లో విజేతలకు ఎస్సార్ వర్సిటీ చాన్స్‌లర్ వరదారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ అర్చనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సెమినార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ, తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, తెలంగాణ ప్రభుత్వ ఈఎఫ్ అండ్ టీ డిపార్ట్‌మెంట్ సంయుక్తంగా ఈనెల 27న 'ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ కెరీర్స్ ఇన్ ఐపీఆర్ అవేర్‌నెస్' అంశంపై సెమినార్ నిర్వహించనున్నారు. పరిపాలనా భవనం సెనేట్‌హాల్‌లో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే సెమినార్‌లో కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు పాల్గొంటారు. 'ఇంపార్టెన్స్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్ ఫర్ అకాడమీ' అంశంపై హెడ్ లీగల్ అండ్ ఐపీఆర్ సుభాజిత్‌సాహా ప్రసంగిస్తారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



- జిల్లాలో 14 లక్షల మందికి ఉచిత ప్రయాణం
- 1100 మందికి రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలు
- ఆరు గ్యారంటీలకు 1.77 లక్షల దరఖాస్తులు
- రైతు భరోసాలో రూ.28.56 కోట్లు
- రూ.2 లక్షల రుణమాఫీ కోసం బ్యాంకర్లతో సంప్రదింపులు
- గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ శివలింగయ్య

జనగామ: జిల్లాలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో, సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ధర్మకంచ మినీ స్టేడియంలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాల్ని మెరుగుపర్చడమే లక్ష్యంగా.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు.



ధర్మకంచ మినీ స్టేడియంలో జెండాకు నమస్కరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న కలెక్టర్



వేదికపై ఎమ్మెల్యేలు, కలెక్టర్

మహిళలకు ఆర్థిక భరోసా



మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో 14,31,675 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్యసాయం కింద రూ.10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ప్రభుత్వం 1,161 మందికి వివిధ రకాల వైద్య సేవల కోసం రూ.3 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. అభయ హస్తం ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేసేందుకు జిల్లాలో 281 జీపీ, 30 మున్సిపల్ వార్డుల్లో దరఖాస్తుల స్వీకరణ విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 1,77,382 దరఖాస్తులు రాగా.. ప్రతి దరఖాస్తుకు జవాబుదారీతనం ఉందన్నారు.

వ్యవసాయానికి పూర్వ వైభవం

వ్యవసాయానికి పూర్వ వైభవం తీసుకొచ్చి, రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ఉచిత విద్యుత్, రైతు భరోసా, పెట్టుబడి సాయం కింద 75,168 రైతుల బ్యాంకు ఖాతాల్లో రూ.28.56కోట్ల మేర జమ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. రూ.2లక్ష రుణమాఫీని పద్ధతి ప్రకారం అమలు చేసేందుకు బ్యాంకర్లతో సంప్రదింపులు జరుగుతున్నట్లు స్పష్టం చేశారు. యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పన, నైపుణ్యాలపై శిక్షణ ఇచ్చేందుకు జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రం, స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య కళా ప్రదర్శనలు

గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని కేజీబీవీ, బచ్చన్నపేట, మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం, జనగామ ప్రభుత్వ బాలికలు, అంగన్‌వాడీ పిల్లలు, ప్రజాధరణ సోషల్ వెల్ఫేర్ సొసైటీ, జాఫర్‌గఢ్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలిచ్చిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందించారు. ప్రత్యేకంగా 15 మంది అంగన్‌వాడీ పిల్లలకు వాటర్ బాటిళ్లు బహూకరించారు. మైత్రేయ కళాక్షేత్రం కూచిపూడి విద్యార్థులను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. స్వాతంత్ర్య సమరయోధులు లింగాల ఘనపురం మండలం కళ్లెం గ్రామానికి చెందిన బహదూర్‌సింగ్‌ను కలెక్టర్ శాలువాతో సత్కరించారు.

స్టాళ్ల సందర్శన

ధర్మకంచ మినీ స్టేడియంలో పోలీస్, వైద్య ఆరోగ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి, హార్టికల్చర్, ఐసీడీఎస్, పాడి పరిశ్రమాభివృద్ధి, సహకార సంస్థ, చేనేత, పాడి పరిశ్రమాభివృద్ధి, సహకార సంస్థ, పౌరసరఫరాలు, వ్యవసాయ, అటవీ, వెను కబడిన తరగతులు, మత్స్య, విద్య, ప్రజాపాలన (స్పెషల్), జిల్లా పర్యాటక, పశు వైద్యం, పేదరిక నిర్మూలన, మెప్మా, ప్రొహిబిషన్-ఎక్సైజ్ శాఖ తదితర శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, అదనపు కలెక్టర్లు రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్ సందర్శించారు. స్టాళ్లు తిలకించిన అనంతరం దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లను అందించారు. అనంతరం జనగామ ఆర్టీసీ బస్ డిపోకు కేటాయించిన నూతన ఎక్స్‌ప్రెస్ బస్సును అదనపు కలెక్టర్లు, డీసీపీ సీతారాంతో కలిసి కలెక్టర్ శివలింగయ్య ప్రారంభించారు.



స్వాతంత్ర్య సమరయోధుడికి సత్కారం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సమీకృత కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకల్లో భాగంగా శుక్రవారం రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అదనపు కలెక్టర్లు పింకేశ్ కుమార్, రోహిత్ సింగ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కలెక్టర్ వేడుకలను ప్రారంభించారు. జనగామ మండలం యశ్వంతపూర్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదోతరగతి విద్యార్థి విక్కీ తబలా వాయిద్యం, లింగాలఘణపురం కేజీబీవీ విద్యార్థుల నృత్యం అలరించాయి. జనగామకు చెందిన మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం చిన్నారుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పెంబర్తి ఎంజేపీటీబీసీ కళాశాల, పాఠశాల, జనగామకు చెందిన ఏకశిల ఉన్నత పాఠశాల, చంపక్ హిల్స్‌లోని న్యూక్రియేషన్, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల సదనం విద్యార్థుల నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జిల్లా వ్యవసాయ అధికారి డీఏఓ వినోద్‌కుమార్ పాడిన 'అపురూప మైనదమ్మ ఆడజన్మ' పాట ఎంతగానో ఆకట్టుకుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు కొండా శ్రీను మిమిక్రీ మంత్రముగ్ధులను చేసింది. తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో ఆలపించిన పాటలు స్ఫూర్తినింపాయి. ఆయా కార్యక్రమాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.సుహాసిని, డీఈఓ రాము, డీఐఈఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ జె.జయంతి, డీసీఎస్‌ఓ రోజారాణి, డీఏఓ వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కడియం శ్రీహరి, జెడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓలు మురళీకృష్ణ, రామ్మూర్తి, జెడ్పీ సీఈఓ అనిల్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ రవీందర్, డీఆర్డీఓ మొగులప్ప, సీపీఓ ఇస్మాయిల్, ఆర్టీసీ డిపో మేనేజర్ జ్యోత్స్న, అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తములకు ప్రశంస

- 8లో



ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ నూతన బస్సులో ప్రయాణిస్తున్న కలెక్టర్ దంపతులు, డీసీపీ, అధికారులు



ఆయిల్‌పామ్ స్టాల్‌లో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్, పక్కన డీసీపీ, అదనపు కలెక్టర్లు



స్టాల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్లు, అధికారులు



బెలూన్లను వదిలిపెడుతున్న కలెక్టర్, డీసీపీ

చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- తాటికొండలో విగ్రహావిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని తాటికొండలో రజక సంఘం శుక్రవారం చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై మాట్లాడుతూ.. విస్నూరు దొర రామచంద్రారెడ్డిని ఎదురించి పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అన్నారు. తాటికొండతో పాటు జిట్టెగూడెం, కొత్తపల్లి, రాఘవాపూర్, ఛాగల్లు తదితర గ్రామాలకు సాగునీరందించేలా.. రూ.29 కోట్లతో మల్లన్నగండి కుడి కాల్వ పనులు నడుస్తున్నాయని, ఆర్నెళ్లలో పూర్తి స్థాయిలో సాగునీరందిస్తామన్నారు. విగ్రహావిష్కరణ కమిటీ కన్వీనర్ అక్కినపెల్లి అంజయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, సర్పంచ్ చల్లా ఉమాసుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, చింతకుంట్ల నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, రాపోలు మధుసూధన్‌రెడ్డి, ఉపసర్పంచ్ రాములు, కొత్తపల్లి సర్పంచ్ గోవిందు ఆనందం, ఎంపీటీసీ బెల్లపు వెంకటస్వామి, కనకం రమేశ్, గణేశ్, చాడ రాజ్‌కుమార్, శ్రీను, విగ్రహ కమిటీ కన్వీనర్ అంజయ్య, సత్తయ్య, వెంకన్న, ఉబ్బని మల్లేశం, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆశయ్య, జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మచ్చ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కడియం తదితరులు

ఆదర్శం.. పద్మశ్రీ సమ్మయ్య

- ఎమ్మెల్యేలు కడియం, పల్లా
- పద్మశ్రీ గ్రహీతకు సన్మానం

దేవరుప్పుల: ప్రముఖ చిందు యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు రావడం హర్షనీయమని, ఆయన అందరికీ ఆదర్శం అని స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడంతో శుక్రవారం ఎమ్మెల్యేలు అప్పిరెడ్డిపల్లెలోని సమ్మయ్య స్వగృహానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మీ, స్థానిక సర్పంచ్ సుధాకర్, కౌన్సిలర్ గాడిపెల్లి ప్రేమలతారెడ్డి, పేర్ని స్వరూప, బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్ల సుందర్‌రామిరెడ్డి, తీగల దయాకర్, పెద్ది రాజిరెడ్డి, బస్వ మల్లేశం, బాషిపెల్లి యాకయ్య, ఏల సోమసుందర్, మాజీ ఎంపీపీ సోమన్న, అర్జున్, చింత రవి పాల్గొన్నారు.



సమ్మయ్యకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



గడ్డం సమ్మయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు కడియం, పల్లా

కళాకారులకు తోడ్పాటునందిస్తాం

చిందు యక్షగాన కళాకారుల అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం మండలంలోని అప్పిరెడ్డిపల్లెలో పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన గడ్డం సమ్మయ్యను వారిద్దరూ కలిసి ఘనంగా సన్మానించి రూ.25 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి, పార్టీ గ్రామ అధ్యక్షుడు కూకట్ల కొమురయ్య, మండల యూత్ అధ్యక్షుడు ఉప్పుల అనిల్ కుమార్, దామెర అనిల్, మహేందర్‌జీ, రమేశ్, నాగాజు, ప్రశాంత్, నరేశ్ పాల్గొన్నారు.

రసాయన రహిత ఆహారంతోనే ఆరోగ్యం

- కలెక్టర్ శివలింగయ్య
- ఘనంగా సంక్రాంతి మహోత్సవ్

జనగామ: ప్రజలు జీవన విధానంలో మార్పులు చేసుకుని, రసాయన రహిత ఆహారానికి ప్రాధాన్యమిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. జిల్లా కేంద్రం హైదరాబాద్ రోడ్డులోని వేద ఆయుర్వేద పంచకర్మ వెల్‌నెస్ హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన విశ్వ మంగళ్ దివస్(సంక్రాంతి మహోత్సవ్)లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం స్వర్ణప్రాషణ, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలు రసాయన ఆహార పదార్థాలకు అలవాటుపడి, అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఆరోగ్యం కోసం సనాతన ధర్మాన్ని పాటించి, ఆహార అలవాట్లతో పూర్తిగా మార్పులు తెచ్చుకోవాలన్నారు. అనంతరం హాస్పిటల్‌లో ఉత్తమ సేవలందిస్తున్న సిబ్బందికి డాక్టర్ అంజిరెడ్డి ఆర్థిక సాయంతో రూ.5 వేల నగదు పారితోషికం, జ్ఞాపికను అందించారు. అంతకు ముందు చిన్నారులకు స్వర్ణప్రాశణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తన కుమారుడికి స్వయంగా స్వర్ణప్రాశణ డ్రాప్స్ వేశారు. దీంతో పిల్లల్లో మేథోశక్తి, కండరాల దృఢత్వంతో పాటు ఆరోగ్యపరంగా మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వరంగల్ విశ్వ ఆయుర్వేద పరిషత్ డాక్టర్లు ప్రేమానంద్, శ్రీనివాస్‌రెడ్డి, సారంగపాణి, కిషన్, సంతోశ్ జాకోటియా, రాము, నరేశ్, విజయ్, రఘు, వేద హాస్పిటల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

టెన్త్ పరీక్షలకు సన్నద్ధత

విద్యారణ్యపురి: ఈ ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లాపరిషత్, కేజీబీవీల, మోడల్, రెసిడెన్షియల్ స్కూల్స్ హెచ్‌ఎంలతో ఈనెల 27న సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై ఒక ప్రకటనలో తెలిపారు. వందశాతం ఫలితాలు సాధించేలా కొంతకాలంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. స్లిప్‌టెస్టుల్లో విద్యార్థులకు వచ్చిన ఫలితాలను బట్టి హెచ్‌ఎంలతో ఆయా హైస్కూళ్ల వారీగా కలెక్టర్ సమీక్షించనున్నారు.

నేడు ఓరియంటేషన్ ప్రోగ్రాం

కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో డిగ్రీ (బీకాం, బీబీఏ) అధ్యాపకులకు రిపోర్టు రైటింగ్‌పై ఈనెల 27న ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు కళాశాల బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఆచార్య కట్ల రాజేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వీసీ, ప్రిన్సిపాల్, విభాగాధిపతి పాల్గొంటారని పేర్కొన్నారు.

మహాసభల్ని విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్

జనగామ రూరల్: ఫిబ్రవరి 11, 12, తేదీల్లో జరిగే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహా సభల్ని విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఉమాపతి భవన్‌లో జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య అధ్యక్షతన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 'అంతరాలు లేని విద్య-ప్రజల హక్కు-ప్రభుత్వ బాధ్యత' అంశం ప్రధాన ఎజెండాగా మహా సభలు జరుగుతాయన్నారు. ఆసభలకు ముఖ్య అతిథిగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర్‌రావు, విద్యాశాఖ కార్యదర్శి బుర్ర కార్యదర్శి, డైరెక్టర్ దేవసేన, ప్రొఫెసర్ కోదండరామ్ హాజరవుతారని తెలిపారు. అలాగే.. పలు అంశాలపై ప్రజలనుద్దేశించి హరగోపాల్ ప్రసంగిస్తారన్నారు. ఈమహాసభను విజయవంతం చేయాలని కోరారు. యాదగిరి, కొమురెల్లి, సునంద, శ్రీనివాస్, అకుషావలి, వెంకన్న, రాజేందర్, లక్ష్మణ్, వరప్రసాద్, సత్యవర్దన్ తదితరులున్నారు.

ఉత్తములకు ప్రశంసలు



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకుంటున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని

విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులు, అధికారులకు జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో శుక్రవారం జరిగిన గణతంత్ర వేడుకల్లో ప్రశంసపత్రాలు అందించారు. శాఖల వారీగా ప్రతిభ కనబర్చిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి డీసీపీ పి.సీతారాం, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, పింకేశ్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య ప్రశంసపత్రాలు అందించారు. - జనగామ





క్లుప్తంగా

గూర్ఖాకు దాతల చేయూత



రాణాకు నగదు అందజేస్తున్న దాతలు

సాక్షి స్పందన

డోర్నకల్ : డోర్నకల్‌లో గూర్ఖాగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన డమ్మర్ రాణా గుండె జబ్బు చికిత్స కోసం దాతలు చేయూతనందిస్తున్నారు. పేదరికానికి తోడు గుండె జబ్బు బారిన పడటం, నేపాల్ దేశస్తుడు కావడంతో రేషన్ కార్డు లేక చికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇటీవల సాక్షి దినపత్రికలో గూర్ఖాకు గుండె జబ్బు పేరుతో కథనం ప్రచురితం కాగా దాతలు స్పందిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం వరంగల్‌కు చెందిన న్యాయవాదులు రూ.5 వేల నగదు అందించారు. శుక్రవారం డోర్నకల్ జెడ్పీఎస్ఎస్ 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు డమ్మర్ రాణా ఇంటికి వచ్చి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వీరబోయిన రమేష్, సీహెచ్ రవి, భూక్యా రాజేష్, ఎల్.విజయ్, జక్కుల నరేష్, ఎస్‌కె రేష్మా, ధరావత్ రేష్మా, రాధిక తదితరులు పాల్గొన్నారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



గట్టయ్య మృతదేహం

మడికొండ : గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మడికొండ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాజీపేట మండలం మడికొండ గ్రామానికి చెందిన దండింగం గట్టయ్య(70) అనారోగ్యంతో పాటు అప్పులు అధికమయ్యాయి. దీంతో జీవితంపై విరక్తి చెందిన గట్టయ్య శుక్రవారం మడికొండ శివారు ఇండస్ట్రీయల్ ఏరియలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జక్కుల రాజబాబు తెలిపారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

ప్రాణం మీదికి తెచ్చిన క్షణికావేశం

- సమక్క జాతరలో వర్కర్ల మధ్య గొడవ
- బార్ యజమాని బంధువు మందలింపు
- పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం
- 80శాతం కాలిన శరీరం.. పరిస్థితి విషమం

ఎస్ఎస్‌తాడ్వాయి/ఖిలా వరంగల్: విహార యాత్ర విషాదంగా మారింది. మద్యం మత్తులో వర్కర్ల మధ్య చోటుచేసుకున్న స్వల్ప ఘర్షణ.. బార్ యజమాని బంధువు మందలింపు..ఓ వ్యక్తి ఆత్మహత్యయత్నానికి దారితీసింది. ములుగు జిల్లా మేడారం జాతరలో శుక్రవారం జరిగిన ఘటన వివరాలు స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండకు చెందిన మడిపెల్లి సతీష్(28) కొంతకాలంగా వరంగల్ కరీమాబాద్‌లోని ఓ బార్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా వర్కర్ల అభ్యర్థన మేరకు శుక్రవారం తెల్లవారుజామున బార్ యజమాని ఓ వాహనంలో వర్కర్లను సమ్మక్క,సారలమ్మ దర్శనానికి పంపించారు. వారి వెంట బార్ యజమాని బంధువు కత్తి దేవేందర్ వెళ్లారు. ఉదయం అమ్మవార్ల దర్శనం అనంతరం మేక కోసి వంటలు చేసుకున్నారు. అందరు కలిసి మద్యం తాగుతుండగా.. అక్కడికి ఓ యాచకుడు రాగా.. అందరూ అతడిని తిట్టారు. తోటి వర్కర్ల తీరుపై అసహనం వ్యక్తం చేసిన సతీష్ భిక్షగాడికి రూ.50 అందజేశాడు. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న వర్కర్లు.. సతీష్ మధ్య ఘర్షణ జరిగింది. దీంతో అక్కడే ఉన్న బార్ యజమాని బంధువు మందలించాడు. యజమాని బంధువు అయితే నన్ను తిడతాడా అంటూ మనస్థాపానికి గురైన సతీష్ భోజనం చేయకుండానే బయటకు వెళ్లి ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని వివరాలు సేకరించి 80శాతం కాలిన గాయాలైన సతీష్‌ను 108 వాహనంలో ములుగు ఆస్పత్రికి పంపించారు. వైద్యుల సూచన మేరుగైన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెబుతున్నారు.



ఎంజీఎంలో చికిత్స పొందుతున్న సతీష్

బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడి



పట్టుబడిన మద్యం బాటిళ్లను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

- మద్యం స్వాధీనం, నిర్వాహకులపై కేసు

ఖిలా వరంగల్ : అక్రమంగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై ఆకస్మికంగా దాడి చేసి రూ.1,80,440ల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, పెండ్యాల దేవేందర్ తెలిపారు. మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శాకరాసికుంట కాలనీకి చెందిన ఎనుగందుల రాజు, మామునూరు స్టేషన్ పరిధి తిమ్మాపురం గ్రామశివారు లక్ష్మీపురానికి చెందిన నాగప్ప శివ వేర్వేరుగా తమ ఇంట్లో భారీగా మద్యం నిల్వ చేసి విక్రయిస్తున్నారని సమాచారం అందింది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో వేర్వేరుగా బెల్ట్‌షాపులపై దాడి చేశారు. ఈదాడుల్లో ఎనుగందుల రాజు ఇంట్లో సుమారు రూ.1,65,160ల విలువైన మద్యం బాటిళ్లు, లక్ష్మీపురం గ్రామానికి చెందిన నాగప్ప శివ ఇంట్లో రూ.15,280ల మొత్తం రూ.1,80,440ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని రాజు, శివపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ టి.సురేష్, మామునూరు ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్‌కు వేర్వేరుగా అప్పగించారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఈ.నర్సింహరావు, మామునూరు ఎస్సై కృష్ణవేణి, కానిస్టేబుళ్లు బావ్ సింగ్, వీరన్న పాల్గొన్నారు. వరంగల్ మిల్స్‌కాలనీ ఏసీరెడ్డినగర్‌కు చెందిన గడ్డం రమేష్ ఇంట్లో రూ.51,680ల విలువైన మద్యం, మామునూరు గ్రామానికి చెందిన సల్లూరి రాజేందర్ ఇంట్లో నిల్వ చేసిన రూ.26,440ల విలువ చేసిన మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఇరువురిపై కేసు నమోదు చేసి మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

విద్యార్థినికి చేదు అనుభవం

- బస్సుల్లో తిరగడం అమ్మాయిలకు ఫ్యాషనైందంటూ మహిళా కండక్టర్ వెటకారం

పరకాల : కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సులో ప్రయాణ సదుపాయం కల్పించడం ఏమో కానీ ఓ విద్యార్థికి మహిళా కండక్టర్ నుంచి చేదు అనుభవం ఎదురైంది. నడికూడ మండలం నర్సక్కపల్లెకు చెందిన విద్యార్థిని మేఘన పరకాల నుంచి హుజురాబాద్ వెళ్లే బస్సెక్కింది. అయితే ఉచిత ప్రయాణం కావడంతో విద్యార్థిని తన వద్ద ఉన్న ఆధార్ కార్డు చూపించింది.. దీంతో మహిళ కండక్టర్ ఫొటో మార్చుకుంటే ఏమవుతుంది.. చిన్నప్పటి కార్డు ఉందా అంటూ వెటకారంగా మాట్లాడింది. కాగా తాను అప్‌డేట్ చేసుకున్నానని చెప్పిన పట్టించుకోలేదని.. అలా మాట్లాడకండి అవసరమైతే డబ్బులు తీసుకొమ్మని చెప్పింది. పైసలు ఎక్కువైనాయా.. అయిన కాలేజీ అమ్మాయిలకు పనిపాట లేకుండా బస్సులో తిరగడం ఫ్యాషనైందనడంతో బస్సులోనే ఆ విద్యార్థి కంటతడి పెట్టుకుంది. ఈ విషయాన్ని తన తండ్రికి ఫోన్‌లో తెలియజేయగా అతను పరకాల ఆర్టీసీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు డిపోకు చేరుకున్నాడు. డీఎం కొత్త బస్సుల ప్రారంభోత్సవం బిజీగా ఉండటంతో అక్కడే ఉన్న కొందరు ఆర్టీసీ ఉద్యోగులు మరోసారి అలా జరగకుండా చూసుకుంటామంటూ నచ్చజెప్పారు. అయితే ఓ వైపు ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కొత్త బస్సులు ప్రారంభిస్తుండగా ఈ సంఘటన జరగడం విశేషం. ఈ విషయంపై ఆర్టీసీ డీఎం రవిచంద్ర దృష్టికి సాక్షి తీసుకెళ్లగా ఆధార్ అప్‌డేట్ చేసుకొమ్మని చెప్పడంలో తప్పులేదన్నారు. బాలిక ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

నేటినుంచి అన్నారం దర్గా ఉర్సు

- మూడు రోజుల పాటు సాగనున్న ఉత్సవాలు
- రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తుల రాక



విద్యుత్ దీప కాంతుల్లో దర్గా

పర్వతగిరి : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామంలో హజ్రత్ సయ్యద్ యాకూబ్ షావలి బాబా దర్గా ఉర్సు ఉత్సవాలు నేటినుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలి వచ్చి దర్గాను దర్శనం చేసుకోనున్నారు. ఉర్సు ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు(శనివారం) రాత్రి ఖవ్వాలి గేయాలాపన, గంధం ఊరేగింపు, రెండో రోజు (ఆదివారం) దీపారాధన, భక్తులకు మహా అన్నదానం, మూడో రోజు(సోమవారం) ఖత్మల్ ఖురాన్‌లతో ఉత్సవాలు ముగుస్తాయి. దర్గాకు ముస్లింలతో పాటు హిందువులు హాజరై మొక్కులు చెల్లించుకుంటారు.

ఉత్సవాలకు నిధుల మంజూరు



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ వక్ఫ్‌బోర్డు నుంచి రూ.7.10లక్షలు మంజూరయ్యాయి. దర్గాతో పాటు చిల్లాల పెయింటింగ్, తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్లతో పాటు అన్నదానం, ఇతర సదుపాయాలకు కేటాయించి ఏర్పాట్లు పూర్తి చేశాము.

-రియాజ్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్


భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం..



అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం. యాకూబ్ బాబా అనుగ్రహంతో ప్రతీ ఏటా బాబాకు గంధం సమర్పించేందుకు ముజేవార్ల ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్తారు. గంధం తీసుకెళ్లే సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తి దర్గాలో గంధం సమర్పిస్తాం.

-ఖాజాపాషా, ముజేవార్

పోలీసుల బందోబస్తు



గంధం ఊరేగింపునకు పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశాం. భక్తులను క్యూలో నిలబెట్టడానికి, ట్రాఫిక్ మళ్లింపు, వాహనాల పార్కింగ్, దొంగతనాల నివారణకు క్రైం పార్టీ, గంధం ఊరేగింపునకు స్పెషల్ పార్టీ పోలీసులు విధులు నిర్వహిస్తారు. దర్గా వద్ద కంట్రోల్ రూం ఏర్పాటు చేసి బందోబస్తు పర్యవేక్షణ చేయడం జరుగుతుంది. భక్తులు, ఉత్సవ నిర్వాహకులు, పోలీసులకు సహకరించాలి.

- వీరభద్రరావు, ఎస్సై, పర్వతగిరి

16 కిలోల గంజాయి స్వాధీనం

- నిందితుడి అరెస్ట్

కాజీపేట : కాజీపేట రైల్వే జంక్షన్‌లో అనుమానస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని తనిఖీ చేయగా అతని వద్ద 16కిలోల ఎండుగంజాయి లభ్యమైందని ఎక్సైజ్ సీఐ చంద్రమోహన్ తెలిపారు. ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. రైలు ద్వారా ఒడిశా రాష్ట్రం నుంచి నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం రైల్వే స్టేషన్‌లో మకాం వేసి నిందితుడు సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో ఎస్సై తిరుపతి, హెడ్‌కానిస్టేబుల్ ఖలీల్, కోటి, వీరమల్లు, రవీందర్, లాలయ్య, ఆయుబ్ పాల్గొన్నారు.



నిందితుడితో పాటు పట్టుబడిన గంజాయిని చూపుతున్న సీఐ చంద్రమోహన్

తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడి మృతి



గోపాల్ (ఫైల్)

చిల్పూరు: మండలంలోని పల్లగుట్టకు చెందిన గీతకార్మికుడు ఉమ్మగోని గోపాల్(52) శుక్రవారం వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారి కిందపడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాలు.. గీత వృత్తే ఆధారపడి కుటుంబాన్ని పోషించుకుంటున్న గోపాల్ రోజు మాదిరిగానే కల్లు గీసేందుకు వెళ్లాడు. చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకు జారడంతో కిందపడి తీవ్రంగా గాయపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రజిత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. కాగా కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గణగోని రమేష్, గౌడ సంఘం గ్రామ అధ్యక్షుడు చిర్ర నాగరాజు, వెంకటేశ్వర్లుతో పాటు పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వం తరపున రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వారు కోరారు.

ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్..



సురేష్(ఫైల్)

నర్సింహులపేట : మండలంలోని బొజ్జన్నపేట గ్రామ పరిధిలో శుక్రవారం ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడడంతో డ్రైవర్ మృతిచెందాడు. ఎస్సై గండ్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలంలోని సింగారం గ్రామానికి చెందిన చెరుకు సురేష్(30) బొజ్జన్నపేట గ్రామ పరిధి నుంచి ట్రాక్టర్లో మట్టిని తరలిస్తున్నాడు. ఈక్రమంలో కాల్వ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడటంతో సురేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య శ్రావణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు.